'బెట్టింగ్' ఇన్‌ఫ్లూయెన్సర్లు!

- డబ్బుల కోసం నిషేధిత యాప్‌లకు ప్రమోషన్
- భారీగా ముట్టజెబుతున్న యాప్‌ల నిర్వాహకులు
- క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, గివ్ అవేలతో టీనేజర్లపై వల
- ఈజీ మనీ కోసం గుడ్డిగా ఫాలో అవుతున్నవైనం

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాలో కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. సైబర్ మోసగాళ్లు ఇచ్చే డబ్బులకు కక్కుర్తిపడి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌లను అడ్డగోలుగా ప్రమోట్ చేస్తూ తమను గుడ్డిగా ఫాలో అవుతున్నవారిని ఇరకాటంలో పెడుతున్నారు. మొదట ఏవేవో ఆసక్తికరమైన వీడియోలు చేస్తూ, సూక్తులు చెబుతూ టీనేజర్లను ఆకట్టుకుంటున్నారు. అలా ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లు పెరగ్గానే నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ద్వారా తెలివిగా బెట్టింగ్‌లు పెట్టిస్తున్నారు.

విలువైన బహుమతులు ఆశ చూపి..

'మీకు ఐఫోన్-15 కావాలా? ఖరీదైన వాచ్‌లు కావాలా? అయితే వెంటనే నా చానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసి, కింద ఉన్న టెలిగ్రామ్ లింక్‌ను ఓపెన్ చేయండి. అందులో నా చానల్‌లో జాయిన్ అవ్వండి. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి. లేదంటే చిన్న చిన్న గేమ్స్ ఆడి ఐఫోన్లను సొంతం చేసుకోండి. గేమ్‌లో గెలిచి ప్రతిరోజూ డబ్బులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు పొందండి. జాగ్రత్తగా ఆడండి' అంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ తన యూట్యూబ్ అకౌంట్‌లో ఉన్న దాదాపు 4.22 మిలియన్ మంది సబ్‌స్క్రైబర్లకు రోజూ ఆశపెడుతున్నాడు. అతను ఇచ్చిన లింక్‌ను ఓపెన్‌చేస్తే నేరుగా అతని టెలిగ్రామ్ చానల్ ఓపెన్ అవుతుంది. అందులో వీడియో కింద ఇచ్చిన ఏపీకే ఫైల్ లింక్‌ను ఓపెన్ చేయగానే '1విన్' అనే బెట్టింగ్ యాప్ ఓపెన్ అవుతుంది. అందులో కనీసం రూ.300 బెట్టింగ్ పెట్టమంటాడు. అలా పెడితే.. మొదటిసారి కనీసం రూ.600 వస్తాయి. ఆ డబ్బులతో మళ్లీ బెట్టింగ్ పెడితే.. విన్నింగ్ అమౌంట్ పెరుగుతుంది. ఆ యాప్‌ల నిర్వాహకులు మనతో రూ.50 వేల వరకు బెట్టింగ్ పెట్టించి మొత్తాన్ని ఒకేసారి ఖతం చేస్తారు.

డబ్బుల కోసం లోన్‌యాప్‌ల ఉచ్చులోకి

ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పే బెట్టింగ్ యాప్‌లలో ఎంతో మంది యువకులు డబ్బులు కోల్పోతున్నారు. తక్షణ డబ్బుల కోసం అనధికారిక లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వకపోయినా రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తుండటంతో ఆ యాప్‌ల నుంచి లోన్లు తీసుకుంటున్నారు. అవి చెల్లించలేక, ఇంట్లో చెప్పుకోలేక, స్నేహితుల నుంచి తీసుకున్న అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికిలోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన 20 ఏండ్ల ఇంజినీరింగ్ విద్యార్థి '1విన్' బెట్టింగ్ యాప్‌లో డబ్బులు కోల్పోవడంతో బయట చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత ఆ అప్పులన్నీ అతని తల్లిదండ్రులు తీర్చాల్సి వచ్చింది.

మరికొన్ని దారుణాలు

హైదరాబాద్‌కు చెందిన కాలేజీ విద్యార్థి శ్రీనివాస్‌కు ఖరీదైన బైక్‌లు, ఫోన్లు, వాచీలు అంటే ఇష్టం. అతడు సోషల్ మీడియాలో అభిమానించే ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ (స్టార్) ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాడు. రూ.100 తో రీచార్జ్ చేసి, స్నేహితులకు రిఫర్ చేస్తే గివ్ అవే కింద యాపిల్ ఫోన్ ఇస్తానని ఆ స్టార్ చెప్పడంతో.. శ్రీనివాస్ ఫాలో అయ్యాడు. బెట్టింగ్ చేస్తూ క్రమంగా ఈజీమనీకి అలవాటు పడ్డాడు. మొదట్లో డబ్బులు వచ్చినా, ఆ తర్వాత పోవడం మొదలైంది. దీంతో నిరక్షరాస్యులైన తన తల్లిదండ్రులను మోసగించి వారి అకౌంట్‌లోని డబ్బును సైతం బెట్టింగ్‌లో పెట్టి రూ.లక్షలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లాకు చెందిన సోమేశ్ వీడియోను చూసి రెండు వారాల తర్వాత జీతం కూడా మిగలకుండా బెట్టింగ్‌లో కోల్పోయాడు.

ఇన్‌ఫ్లూయెన్సర్లపై చర్యలు ఏవీ?

యువత జీవితాలను నాశనం చేస్తున్న యాప్‌లను ఇష్టారీతిన ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై పోలీసులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం బెట్టింగ్ చాలా ప్రమాదకరంగా మారిందని, ఎంతోమంది యువకులు వీటికి బానిసలవుతున్నారని పోలీసులు చెప్తున్నా చర్యలు మాత్రం శూన్యం. ఎలాంటి రక్షణ లేని ఏపీకే ఫైల్స్, యాప్స్ డౌన్‌లోడ్ చేయడం వల్ల డాటాతోపాటు డబ్బులు కోల్పోతున్నారు. అనధికారిక యాప్‌లను ప్రమోట్ చేయడంలో సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లు బాధ్యతతో వ్యవహరించకపోవడంతో ఎంతో మంది యువత, వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పబ్లిక్ ప్లేసుల్లో రీల్స్ చేసేవారిని కట్టడి చేస్తున్నట్టే.. సోషల్ మీడియాలో ప్రమాదకర బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేవారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీచేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

లోన్‌యాప్ వేధింపులకు యువకుడి బలి

శ్రీకాంత్ (ఫైల్)

శ్రీరాంపూర్, ఆగస్టు 24: లోన్‌యాప్ వేధింపులు ఓ యువకుడిని బలితీసుకున్నాయి. ఉరేసుకునే ముందు అతడు తీసిన సెల్ఫీ వీడియో కంటతడిపెట్టించింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా అరునక్కనగర్‌లో చోటుచేసుకుంది. అరునక్కనగర్‌లో నివసించే నమ్తాబాజి శ్రీకాంత్(29) తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టేవాడు. ప్రైవేట్ లోన్ యాప్‌లో రూ. 5లక్షలు, ఫ్రెండ్స్, ఫైనాన్స్‌ల వద్ద రూ.10 లక్షల దాకా అప్పులు చేశాడు. ట్రేడ్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాడు. లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు కూడా ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం చెందినట్టు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. ఆపై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

హైదరాబాద్‌లో రోజూ 2 కోట్ల సైబర్ మోసాలు

గుజరాత్‌లో 36 మంది అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సైబర్ మోసాల వల్ల హైదరాబాద్ ప్రజలు రోజుకు సగటున రూ.2 కోట్ల చొప్పున ఏటా రూ.800 కోట్ల వరకు నష్టపోతున్నారని, విద్యావంతులు సైతం అత్యాశకు పోయి ఈ మోసాల బారిన పడుతున్నారని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు ఇటీవల 7 బృందాలతో గుజరాత్‌లో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి వివిధ కేసుల్లో 36 మందిని అరెస్టు చేశారని, వీరికి దేశవ్యాప్తంగా 983 కేసులతో, తెలంగాణలో 131 కేసులతో సంబంధం ఉన్నదని వెల్లడించారు. ఈ ముఠాల చేతిలో బాధితులు రూ.12.49 కోట్ల వరకు మోసపోయారని తెలిపారు. నిందితుల నుంచి రూ.1.51 కోట్లు రికవరీ చేసి, బాధితులు ఇప్పించామని, మరో రూ.2.89 కోట్లు ఫ్రీజ్ చేశామని సీపీ వివరించారు.

2న కలెక్టరేట్ల ముట్టడి

'బీసీ' జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సమగ్ర కుల గణన ప్రారంభించి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో 26న తలపెట్టిన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2కు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

మంత్రుల సమీక్షకు హాజరుకాలేదని..

సంగారెడ్డి ఆర్డీవోపై బదిలీ వేటు

సంగారెడ్డి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారిపై బదిలీ వేటు పడింది. 21న మంత్రి రాజనర్సింహ సంగారెడ్డిలో పర్యటించారు. మంత్రి పర్యటనలో ప్రొటోకాల్ విధులు సక్రమంగా నిర్వహించలేదని, కలెక్టరేట్‌లో మంత్రి రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ నిర్వహించిన సమీక్షకు ఆర్డీవో వసంతకుమారి గైర్హాజరు కావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పదిరోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవోను ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్ ఆర్డీవో రాజుకు సంగారెడ్డి ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయం జిల్లా రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రానికి డెంగ్యూ ఫీవర్

8 నెలల్లోనే 5,246 కేసులు నమోదు

- గత ఏడాదితో పోల్చితే 36% పెరుగుదల
- విజృంభిస్తున్న చికున్‌గున్యా, మలేరియా
- ప్రభుత్వ వైఫల్యంతో ప్రజలకు ప్రాణసంకటం
- లెక్కలు తగ్గించి చెప్తున్న వైద్యారోగ్యశాఖ



డెంగ్యూ కేసులు (ఆగస్టు 21 నాటికి – డీపీహెచ్ లెక్కల ప్రకారం)

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం డెంగ్యూ కోరల్లో చిక్కుకున్నది. ప్రభుత్వ వైఫల్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 22 నాటికి ఏకంగా 5,246 కేసులు నమోదయ్యాయి. ఇందులో 40 శాతం కేసులు ఒక్క హైదరాబాద్‌లోనే వెలుగు చూశాయి. మొత్తం 2,148 మందికి పాజిటివ్‌గా తేలింది. ఇవి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ (ఐఐహెచ్‌పీ)లో నమోదుచేసిన అధికారిక లెక్కలు మాత్రమే. ఇంకా అనధికారికంగా కేసులు రెట్టింపు ఉంటాయని అంచనా. ప్రస్తుతం ప్రతి వంద మంది అనుమానితుల్లో 7-8 మందికి డెంగ్యూ పాజిటివ్‌గా తేలుతున్నది. ఇప్పటివరకు 8 మంది డెంగ్యూతో మరణించినట్టు వైద్యారోగ్యశాఖ చెప్తున్నది. కానీ మరణాలు పదుల సంఖ్యలో ఉంటాయని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఒకే రోజులో ఐదుగురు మరణించడాన్ని ఉదహరించారు. దీంతోపాటు రాష్ట్రంలో మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు సైతం విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలు, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించటం, వైద్యశాఖ సన్నద్ధత.. ఇలా అన్ని విభాగాల్లోనూ ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా గత ఏడాదితో పోల్చితే ఈసారి ఏకంగా 36 శాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. గత ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 22 వరకు రాష్ట్రంలో 3,861 కేసులు వెలుగు చూశాయి. ఈ ఏడాది అదనంగా 1,385 కేసులు పెరిగాయి.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

డెంగ్యూతోపాటు రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన జ్వర సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తేలింది. డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్న జిల్లాల్లో హైదరాబాద్ (2,148 మంది) టాప్‌లో ఉన్నది. అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాది 106 చికున్‌గున్యా కేసులు వెలుగు చూశాయి. పాజిటివిటీ రేటు 5 శాతంగా ఉన్నది. 188 మందికి మలేరియా సోకింది. సీజనల్ వ్యాధులపై శనివారం కోఠిలో డీపీహెచ్ రవీందర్ నాయక్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఇందులో ఈ ఏడాది ఆగస్టు 21 వరకు 6,648 కేసులు వెలుగు చూసినట్టు తెలిపారు. అయితే ఐఐహెచ్‌పీ గణాంకాలతో పోల్చితే కేసుల సంఖ్య తక్కువగా ప్రకటించారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే విషయంపై జర్నలిస్టులు ప్రశ్నించగా.. వివరాలను మరోసారి సరిచూసుకుంటానని డీహెచ్ సమాధానం ఇచ్చారు. ఐఐహెచ్‌పీతో పోల్చితే దాదాపు 600 కేసులను తక్కువగా పేర్కొన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కేసుల సంఖ్య 40 శాతం తక్కువ చేసి చూపించారని చెప్తున్నారు.

సన్నద్ధతలో విఫలం

సీజనల్ వ్యాధులను కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్య నిపుణులు చెప్తున్నారు. దోమల నియంత్రణకు ఇతర శాఖలను సమన్వయం చేయటంలో వైద్యశాఖ వైఫల్యం చెందిందని విమర్శిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో దోమలు పెరిగాయని చెప్తున్నారు. వానకాలం మొదలయ్యే సమాయానికి గతంలో పల్లెప్రగతి, పట్టణప్రగతి వంటి కార్యక్రమాలు నిర్వహించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టేవారని, దోమలు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో రసాయనాలు పిచికారీ చేసేవారని, నిల్వ ఉంచిన నీటిని తొలగించేవారని గుర్తు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పక్కన పెట్టడంతో పారిశుద్ధ్యం లోపించిందని అంటున్నారు. దీనికితోడు వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు తీసుకోలేదని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయలేదని, నివారణ చర్యల పట్ల ప్రచారం చేయలేదని మండిపడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో మందుల కొరత నెలకొన్నదని, సాధారణంగా సీజనల్ వ్యాధులకు ముందే పీహెచ్‌సీ నుంచి అన్ని స్థాయుల దవాఖానల్లో బఫర్ స్టాక్‌ను ఉంచుకోవాలని, కానీ ఈసారి అనేక దవాఖానల్లో సెలైన్ బాటిళ్లు, యాంటిబయాటిక్స్ కూడా లేని దుస్థితి నెలకొన్నదని చెప్తున్నారు. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు.

డెంగ్యూతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో విషాదం

ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24: డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. తొర్రూరు పట్టణం బీరప్పనగర్‌కు చెందిన రమేశ్, లక్ష్మీకాంత కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) వరంగల్ జిల్లా బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి జ్వరం బారినపడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి పిలిపించారు. తొర్రూరులోని ఓ ప్రైవేట్ దవాఖానలో శుక్రవారం చికిత్స చేయించి అదే రోజు ఇంటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం జ్వరం తీవ్రం కావడం, వాంతులు, ఫిట్స్ రావడంతో పట్టణంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రక్తకణాలు పూర్తిగా తగ్గాయని, పెద్ద దవాఖానకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించడంతో ఖమ్మంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు డెంగ్యూతో చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు నిధుల విడుదలేది?

మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను (బీఏఎస్) ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో విద్య కోసం నిర్వహిస్తున్నారని ఆయన శనివారం ఎక్స్ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్కూళ్లలో మొత్తం 25 వేల మంది చదువుకుంటున్నారని, ఇందులో 18 వేల మంది ఎస్సీ క్యాటగిరీ, 7 వేల మంది ఎస్టీ క్యాటగిరీ విద్యార్థులు ఉన్నట్టు పేర్కొన్నారు. అణచివేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, తమ కుటుంబాల్లో చదువుకుంటున్న తొలి తరం వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, కూలీల పిల్లలు ఉన్నారని తెలిపారు. పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఇలాంటి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.

నిజామాబాద్‌లో కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

వివాదాలు ఉన్నచోటే పరిష్కారాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

వినాయక్‌నగర్, ఆగస్టు 24: పౌర సమాజంలో ఎక్కడ వివాదాలు ఉంటాయో, పరిష్కారాలు కూడా అక్కడే దొరుకుతాయని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనుషుల మధ్య తలెత్తిన వివాదాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వీలున్నదని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించని వారి సంతానం మధ్యవర్తిత్వ భాషను అర్థం చేసుకోవాలని సూచించారు. భవనానికి పునాది ఎంత బలమైనదో మధ్యవర్తిత్వానికి కమ్యూనిటీ మీడియేటర్లు అంత బలమైన వారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జే శ్రీనివాస్ రావు అన్నారు. మనుషుల మధ్య నెలకొన్న చిన్న, చిన్న విభేదాలు మొదటి దశలోనే తుంచి వేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ మాట్లాడుతూ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వ వ్యవస్థలలో కమ్యూనిటీ మీడియేటర్లు ప్రధాన భూమిక పోషించాలని కోరారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఇతర జడ్జీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆగ్రహజ్వాల!

- వేతన పెంపు, క్రమబద్ధీకరణను పట్టించుకోని సర్కారు
- హామీల అమలుకు టీచర్లు, ఆయాల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను క్రమబద్ధీకరిస్తాం' ఇదీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన కోటిన్నొక్క హామీల్లో ఒకటి. మరిప్పుడు ఆ హామీ గురించి కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడమే లేదు. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు వెళ్తే పట్టించుకునే నాథుడే లేదని అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. పోస్టులను క్రమబద్ధీకరించడంతోపాటు వేతన స్కేల్ పెంచాలన్న డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,400 మాత్రమే వేతనం చెల్లిస్తుండగా, రూ.21 వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదే దశలో వేతన పెంపు అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సానుకూలతను వ్యక్తం చేయడంతో దీనిపై గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు అంగన్‌వాడీ టీచర్లు చెప్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రులు, అధికారులు చుట్టూ తిరుగుతున్నామని టీచర్లు, ఆయాలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి సర్కారుపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆగ్రహంతో ఉన్నారు.

సీఎంఆర్ బకాయిలపై అధికారుల సీరియస్

మిల్లుల యజమానుల ఇంట్లో వస్తువులు స్వాధీనం

పెబ్బేరు/కొత్తకోట, ఆగస్టు 24 : సీఎంఆర్ ధాన్యం బకాయి పడిన రెండు మిల్లుల యజమానుల ఇంట్లోని వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలు వనపర్తి జిల్లా పెబ్బేరు, కొత్తకోట మండలాల్లో శనివారం చోటుచేసుకున్నాయి. రంగాపురంలోని శివసాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు.. ప్రభుత్వానికి రూ. 3,57,22,693 సీఎంఆర్ ధాన్యానికి సంబంధించి బకాయి పడింది. జనుంపల్లిలోని మిల్లు యజమాని విజయ ఇంటికి వెళ్లి టీవీ, ఇన్వర్టర్, ఏసీ, స్కూటీలు, మిల్లులోని రిఫ్రిజిరేటర్‌ను, కొత్తకోట మండలం నాటవెల్లిలోని వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని వెంకటరమణ ఇంట్లోని కారు, ఏసీ, ఇన్వర్టర్లు, ఫ్రిజ్, టీవీలను తహసీల్దార్ కార్యాలయాలకు తరలించారు.

చకచకా పంచాయతీ ఓటరు జాబితా

- కనీసం ఐదుగురు... గరిష్ఠంగా 21 మంది వార్డుసభ్యులు
- 6న ముసాయిదా జాబితా.. 21న తుది జాబితా

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగా వార్డుల వారీగా ఓటరు జాబితా తయారి ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. పంచాయతీల్లో జనాభా ఆధారంగా వార్డులు ఎన్ని ఉండాలనే ఉన్నతాధికారులు నిర్దేశించారు. 2011 జనాభాను పరిగణనలోకి తీసుకొని వార్డుల సంఖ్యను నిర్ధారించారు. గ్రామంలో ఉన్న ఓటర్ల సంఖ్య, అన్ని వార్డుల్లో సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వార్డుల వారీగా ముసాయిదా జాబితాను రూపొందించారు. కార్యదర్శులకు ఎదురయ్యే సమస్యలు, సందేహాలను ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తీరుస్తున్నారు. వార్డులవారీగా జాబితా తయారు చేయటంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించిన ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొంటున్నారు. జాబితాలో కొందరు ఒకే కుటుంబానికి చెందినవారు ఉన్నా.. వారి పేర్లు ఒకే దగ్గర లేకపోవటంతో వారందర్నీ గుర్తించడానికి ఎక్కువ సమయం పడుతున్నదని కార్యదర్శులు చెప్తున్నారు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం వచ్చే నెల 6న ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 21న తుది జాబితాను ప్రకటిస్తారు. అయితే, ఇదే సమయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కూడా క్లియర్ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. పారిశుద్ధ్యం, స్టిఫికెట్ల జారీ తదితర పనులు చేసుకోవాల్సి ఉంటుందని, వీటన్నింటినీ ఒకేసారి చేయాల్సి రావడంతో ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

124 మందికి 'ప్రగతి చక్ర'

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన 124మంది ఉద్యోగులకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఉన్నతాధికారులతో కలిసి అవార్డుగ్రహీతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, పతకాలు, బ్యాడ్జీలు, నగదు రివార్డులు ప్రదానం చేశారు. వరంగల్-2 డిపో డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబ సభ్యులకు రూ.1.15కోట్ల విలువైన ప్రమాద బీమా చెక్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కృష్ణకాంత్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, ఉషాదేవి పాల్గొన్నారు.

అసోసియేషన్లు చెబితే ప్రమోషన్ ఇచ్చాం

- 'సీఎం శాఖలోనే పదోన్నతుల అర్రాస్ కథనం'